# యోగం

ఇంటర్ రెండవసారి కూడా తప్పటంతో మనసు వికలమైపోయింది. నాన్నగారికి తెలీకుండా అయిదొందలు కాజేసి ఎవ్వరికీ చెప్పకుండా రైలెక్కేను.

ఎటువెళ్లాలో అర్ధంకాని పరిస్థితిలో వున్న నేను వారణాసికి టిక్కెట్టు తీసుకున్నాను.

కట్టుబట్టలు తప్పించి నావెంట ఏమీ తెచ్చుకోలేదు. అమ్మలేని నన్ను నాన్నే గారాబంగ పెంచి పెద్దచేసాడు. తల్లిలేని పిల్లవాడిననేసి అన్నయ్య మహేష్ నిన్నేమీ అనేవాడు కాదు. నాన్నకి సంపాదన తక్కువ. నన్ను మరోసారి ఇంటర్ పరీక్ష రాయంచటానికి వప్పుకోలేదు. ఏదైనా వుద్యోగం చేయమంటాడు. నా చదువుకి వుద్యోగమేమొస్తుంది. హెూటల్లో కాఫీ కప్పులు కడగటమో... బస్టాండులో లాటరీ టిక్కెట్లు అమ్మటమో చేయాల్సివస్తుంది!. అది నాకిష్టం లేదు.

అందుకే... ఏదో సాధించాలని ఇంట్లోంచి పారిపోయి రైలెక్కేను.

రెండవసారి కూడా పరీక్ష తప్పి ఇంట్లో ఎవ్వరికీ కన్పించకుండా పోయానంటే... ఆత్మహత్యకి పాల్పడి వుంటాననుకుంటారు. లేదూ... నక్సలైట్లలో కల్సిపోయానని తిట్టుకుంటారు. అంతేకదా...? ఐ డోన్ట్ కేర్.

అడుక్కోవడం జేబుకొట్టడం రైల్వే ప్లాట్ఫారమ్ మీద పడుకోవటమో ఇష్టలేదు.

మరేమిటి? నేనేం చేయాలి? ఏంచేస్తే గౌరవంగా బ్రతగ్గలుగుతాను?

రిక్షా తొక్కాలా? కూలీపని చేసి మూటలు మొయ్యాలా...?

రైల్లో ప్రయాణిస్తున్న నన్ను రకరకాల ప్రశ్నలు తికమకపెట్టి గందరగోళపరుస్తున్నయ్.

పెరుగన్నం పాకెట్ కొనుక్కుని తిన్నాను. నిద్ర ముంచుకొచ్చేసింది.

ఎన్ని గంటలు ప్రయాణించానో తేలీదు కానీ కళ్లు తెరవగానే వారణాసి వచ్చినట్టు గ్రహించి 'ట్రైన్' దిగాను.

గంగవొడ్డుకెళ్లి స్నానం చేసి... విశ్వేశ్వరుని దర్శించుకుని అన్నదాన సంత్రంలో ఉచిత భోజనం చేసి... టౌన్లోకెళ్లి నాలుగువేపులా తిరిగొచ్చాను.

సాయం సమయంవేళ... సూర్యాస్తమయం కాబోతున్న ఘడియలు... గంగవొడ్డున ఇసుకలో నేను! ఎవ్వరికీ తెలీని నేను నా చుట్టూ వున్న వారిని పరిశీలిస్తున్నాను.

గంగ పరవళ్లు తొక్కుతోంది. నాకు తెలుగు కొద్దిగా ఇంగ్లీషు తప్ప మరో భాష రాని కారణంగ అక్కడి వారితో సంభాషించటం... విషయాన్ని అర్థం చేసుకోవటం కష్టమైనా... సైగలతో గడిపేస్తున్నాను.

దూరాన అక్కడక్కడ సాధువులు వివిధ భంగిమల్లో నిలబడి, కూర్చుని, తల్లక్రిందులుగా విన్యాసాలు చేయటం గమనించాను. వారికెవరు దిక్కు? నాకూ అంతేననుకుని నిట్టూర్చాను.

వయసు మళ్లిన ఒక సాధువు తదేకంగా దూరం నుండి నన్నే చూస్తున్నాడు. కొంతసేపటికి ఆ వృద్ధ సాధువు నా దగ్గరగా వచ్చాడు.

"నువ్వా యోగ విద్య నేర్చుకుంటావా?-" ఆప్యాయంగా అడిగాడు.

ఆయనెవరో? నేనెవరో?... అపరిచిత వ్యక్తి నన్ను పలుకరించి ప్రశ్నించటం చూచి నివ్వెరపోయాను.

ఏమని బదులీయాలో తెలీక తలవూపేను.

"సన్యాసులకు... సాధువులకు... యోగాసనాలంటే ప్రాణం! వారికది వెన్నతో పెట్టిన విద్య! - నీకూ నేర్పుతాను సరేనా?-"

వృద్ధ సాధువు నాతలమీద ఆయన కుడి అరచేతిని వుంచి నా ముఖంలోకి చూసేడు. కరెంట్‌షాక్ లాంటిదేదో నా శరీరమంతా పాకినట్టన్పించింది.

నా పక్కనే కూర్చుని నా చేతిని అందుకుని అన్ని కోణాల్లోంచి వీక్షించటం నాకు ఇబ్బంది అన్పించింది.

"మీకు హస్తసాముద్రికం కూడా వచ్చా?-" సాధువును అడిగాను.

అందుకు ఆయన చిరుమందహాసంతో ఒక్క హస్తసాముద్రికమే కాదు... ప్రాణాయామం.. యోగాసనాలు... మంత్రం... తంత్రం... అన్నీ వచ్చు - నా శిష్యరికం చేసి అన్ని విద్యలూ నేర్చుకుంటావా?!- నా కోరిక సిద్ధించబోతోంది. నా ఆశయం నెరవేరబోతోంది. నీవంటి వాని కోసమే వెతుకుతున్నాను. నేను ఏకోనారాయణున్ని - విద్య నేర్చుకుంటూ నాతోనే వుందువుగాని. నాతోరా... వెళ్దాం...' అన్నాడాయన.

ఎందుకు ఏమిటి అని ప్రశ్నించకుండా వృద్ధ సాదువు వెంట నడుస్తున్నాను.

"నీ పేరు చెప్పలేదే...?"

"నా పేరు రఘు!-"

"నన్ను అంతా సర్వేశ్వర మహరాజ్ అంటారు.! చాలాకాలం హిమాలయాల్లో తపస్సు చేసాను. దేశమంతా తిదిగాను. ఇక్కడ స్థిరపడాలని వచ్చాను..."

తన గురించి చెప్పేదంతా శ్రద్ధగా వినసాగేను.

"ఈ ప్రపంచంలో నేను ప్రస్తుతం వంటరివాడిని!. ఇల్లువిడిచి పారిపోయి వాచ్చాను. పొట్టపోసుకునే మార్గం కోసం వెతుకుతున్నాను....' నడుస్తూ చెప్పాను.

"నీకు అన్నీ సిద్ధిస్తయ్. నువ్వు చాలా గొప్పవాడివౌతావ్!. తొందరపడకు! నాతో వుంటే నీకు ఏలోటు వుండదు..." నా భుజం మీద చెయ్యివేసి నడుస్తున్నాడు సాధు మహరాజ్.

నాకు బోధపడనిదల్లా ఒక్కటే!. కట్టుగుడ్డల్తో ఇంట్లోంచి పారిపోయి వచ్చిన నేను గొప్పవాడినెలా కాగలను?

"నీ తెగింపే నీకు జయాన్నీ... విజయాన్నీ ఇస్తుంది. విశ్వేశ్వరుడు నీయందున్నాడు.' అన్నాడు సాధువు నా తల నిమురుతూ

అలా నడుస్తూ వెళ్లి సర్వేశ్వర మహరాజ్ ఆశ్రమం చేరుకున్నాం!

X X X

"నీవంటిన వున్న బట్టలు తీసి వాటిని ఆ వంకీకి తగిలించి అదిగో ఆదండెంమీదున్న కాషాయ వస్త్రాన్ని కట్టుకో..."

సాధూమహరాజ్ చెప్పినట్టే చేసాను.

నా భుజాన వేలాడే జంధ్యాన్ని చూచి "నీకు ఉపనయనం అయింది?- చాలా సంతోషం!. నువ్వు...?" ఇంకా ఏదో అనబోయారు.

సాధూ మహరాజ్ ఆంతర్య గ్రహిచి 'నేను బ్రాహ్మణుడను' అన్నాను.

"నీకు సంధ్యావందనం వచ్చా?"

"... వచ్చు! కానీ... చేయటంలేదు..."

"ఎందుకని?"

మౌనం వహించాను.

"బ్రాహ్మణ కులంలో పుట్టి... శుచి శుభ్రత.. సంధ్యావందనం.. భోజనానికి కూర్చున్నప్పుడు ఔపోసన పట్టడం... ముగిసేక ఉత్తరోపాసన చేయటం.... మడి ఆచారం.. వంటివేవీ నీకు అబ్బలేదా? అలవరచుకోలేదా?-"

ఏం జవాబు చెప్పాలో తెలియక నోరు మెదపలేదు.

"అందుకే... రానురాను సమాజంలో బ్రాహ్మణులకు ప్రతిష్ట... గౌరవమర్యాదలు తరిగిపోతున్నయ్!. ఈ దేశంలో పుట్టినందుకు భారతీయుడినని ఉత్తమ కులంలో జన్మించినందుకు బ్రాహ్మణుడనని చెప్పుకోవటానికి బిడియ పడనక్కర్లేదు. నుదుట తిలకం దిద్దుకోవటానికి... ముఖాన విభూతి ధరించటానికి... నెత్తిన పిలక వుంచుకోవటానికి మనస్కరించదు. అందుకే ఈ అధోగతి..."

ఆయన మాటల్లో మందలింపు గోచరించింది

"ఇకపై నువ్వు కాషాయ వస్త్రాన్నే ధరించాలి. కండువా తప్పించి మరొక వస్త్రమేం నీ వంటిన వుండరాదు. శైవులం కాబట్టి శివార్చన చేయువారం కాబట్టి స్నానానంతరం నుదిటిన భుజాలకు, ఉదరమునకు విభూతి రాసుకోవాలి' !

"సరే స్వామీ..."

"రేపు నీకు నేను మంత్రోపదేశం చేస్తాను. ఇకపై నీ వ్యవహారిక నామం 'సాధు అవినాష్ మహరాజ్ ' గా మారుతుంది. సాత్వికాహారం మితంగా భుజించాల్సి వుంటుంది. చాపపై పరుండవలెనే గాని మరే ఇతరమైన శయ్యను వుపయోగించకూడదు. ఈ నియమాలను జీవితాంతం పాటిస్తేనే నేను ఆశించే విధంగా ప్రయోజకుడవౌతావ్..."

"అలాగే స్వామీ!"

" ప్రాపంచిక చింతలపై మోజు కూడదు. జీవితాంతం బ్రహ్మచర్యాన్నే అవలంభించాలి!- ధన కనక వస్తువాహనముల యందు మనసు లగ్నం చేయరాదు - స్త్రీ పురుషులందరు మాతాపితలతో సమానమని భావించవలెను బోధపడిందా నాయనా?-"

"ఆజన్మాంతం సాధువుగానే వుండిపోతాను. మీ అడుగుజాడల్లోనే నడుస్తాను. మీమాట జవదాటను!.

"తథాస్తు! పరమేశ్వరుని అనుగ్రహం వలన నీకు అంతా శుభమే జరుగుతుంది... ఈరోజుకి విశ్రమించు!..."

XXX

అయిదేళ్లు కఠోర నియమాలను పాటిస్తూ.. సాధూ మహరాజ్ బాటనే అనుసరిస్తూ

సంపూర్ణ జ్ఞానాన్ని మానసిక పరిపక్వతను పొందగలగటం నా పూర్వజన్మ సుకృతంగా భావించాను.

యోగాభ్యాసంలో ఆరితేరాను. ప్రాణాయామం చేయటంలో పరిపక్వత సాధించాను. శూన్యంలో నుండి విభూతిని సృష్టించి సత్యమూ విశ్వేశ్వరుడ్ని అభిషేకించటం క్షుణ్ణంగ తెల్సుకున్నాను. నియమనిష్టలకు శరీరం మనస్సు అలవాటు పడినయ్.

అన్నివేళలా ఆధ్యాత్మిక చింతన గురు శుశ్రూష తప్పించి మరోధ్యాసలేదు.

"చూడు నాయనా!.. నీవు నేర్చిన విద్యలు ప్రజాక్షేమం కోసమే కాని... నీ వుదరపోషణానికి మాత్రం వినియోగించ వద్దు!- నేను ఆశించిన విధంగా నీలో పరిపూర్ణత లభించింది. ఇక నీకే దిగుల్లేదు. నా ఆశీస్సులు సర్వవేళలా సర్వావస్థలయందు నీవెంటే వుంటయ్. ఆ విశ్వేశ్వరుడు నీకు అంతా మేలు చేస్తాడు. భవిష్యత్‌లో నీకు అంతా శుభమే జరుగుతుంది..." అంటూ గురు సాధు సర్వేశ్వర మహరాజ్ దీవించారు.

తెల్లవారితే భీష్మ ఏకాదశి, తెలతెలవారుతున్న ఘడియల్లో సాధూ మహరాజ్ ఆకస్మికంగా కన్నుమూసి భగవంతుడిలో ఐక్యమైనారు.

సాధు మహరాజ్ పార్థివ శరీరం మీద వాలిపోలేదు. పసివాడిలా రోదించలేదు.

నన్ను అన్నీ తానై చేరదీసి చూచుకుని కన్నతండ్రి కంటే మిన్నగా ఆదరించి తన శిష్యుడిగా స్వీకరించి అన్ని విద్యలూ బోధించిన సాధు మహరాజ్ వారి

భౌతికకాయానికి ఉత్తరక్రియలు శాస్త్రోక్తంగ జరిపించటం నా కర్తవ్యంగ భావించాను.

X X X

గురుసాధూమహారాజ్ పరమపదించేక నేనిక కాశీలో వుండలేకపోయాను. పరిచిత సాధు గణమంతా వుండిపొమ్మని బలవంతము చేసినా మనస్కరించలేదు.

నాలో నిక్షిప్తమైన శక్తులను లోకకళ్యాణం కోసమే వినియోగించాలని చెప్పిన గురూజీ మాటలు మరొకమారు స్ఫురణకొచ్చినయ్.

చివరిసారిగ విశ్వేశ్వరుని దర్శించి దైవాశీస్సులు పొందిన నేను వారణాసి వదిలి హిమాలయాలవేపు దారిపట్టాను.

హిమవత్పర్వత ప్రాంతంలో ఎందరో మహనీయులను కలిసాను.

అక్కడే చాలాకాలం తపస్సు చేస్తూ వుండిపోయాను. మరో అయిదేళ్లకాలం అవలీలగ దొర్లిపోయింది.

యావత్ భారతాన్ని సందర్శించాలనే అభిలాషతో ప్రయాణం సాగించాను.

నదుల్లో పుణ్యస్నానాలు.. క్షేత్రాలల్లో దైవదర్శనాలు... విషయ పరిజ్ఞానాన్ని పెంచుకుంటు వివిధ ప్రాంతాల వ్యత్యాసాలను గమనిస్తూ... పీఠాధిపతులను సందర్శిస్తూ ... మహనీయులతో ప్రాపంచిక విషయాలను చర్చిస్తూ... కాలం గడిచిపోయింది.

ఆఖరి మజిలీగా కన్యాకుమారి చేరుకున్నాను. అక్కడి సముద్రతీరం ప్రశాంత వాతావరణం నన్ను ఎంతగానో ఆకర్షించింది. పురాణేతిహాసకాలం నుండి ప్రసిద్ధి చెందిన పవిత్ర స్థలం కావటంతో అక్కడే స్థినివాసమేర్పరచుకోవాలని వుబలాటపడ్డాను.

సూర్యోదయం వేళ... సముద్రపు ఒడ్డున స్నానం చేసి సూర్య భగవానునికి అర్ఘ్యమిచ్చి... నిర్మలమైన గాలి పీలుస్తూ యోగనిద్రలో వుండిపోయాను.

కళ్లు తెరిచే సమయానికి నా ఎదురుగా ఒక అపరిచిత వ్యక్తి నన్నే చూస్తూ నిలబడి వుండటం గమనించాను.

"స్వామీ... తమ నామధేయం?-" ఆయన్ను ప్రశ్నించాను.

"నా పేరు విష్ణుశర్మ!.. మాది ఆంధ్ర ప్రాంతం! ప్రస్తుతం ఢిల్లీలో వ్యాపారవేత్తగ స్థిరపడ్డాను..." క్లుప్తంగ చెప్పాడు.

"అటులనా చాలా సంతోషం!!"

"మిమ్ములను చూస్తుంటే దైవాన్ని దర్శించుకున్నట్టే వుంది స్వామీ!..."

"పొగడ్తలొద్దు!. నేను మీకు ఏవిధంగ వుపయోగపడగలనో అది చెప్పండి..."

మనిషి ఖరీదైన సూట్‌లో వున్నాడు. కళ్లకు గోల్డ్‌ఫ్రేమ్ అద్దాలు... సగం నెరిసిన బట్టతల.. విశాల వక్షస్థలం... ఆకర్షణీయమైన ముఖవర్చస్సు... సుందరంగ అవుపించారు విష్ణుశర్మ.

"ఆశ్చర్యపోకండి! ఇంగ్లీషు చదువుతోపాటు వేదాధ్యయనం కూడా చేసినవాడిని!. ఉదరపోషణకై వుద్యోగంలో చేరకతప్పలేదు. అదృష్టం కలిసొచ్చి వ్యాపారవేత్తనై కోట్లకి అధిపతి నయ్యాను...."

"చాలా సంతోషం! అంతా దైవేచ్ఛ!!-"

" నాదొక మనవి. ఇంత సంపద... ఉన్నతి... పలుకుబడి... సంసారం... సంతానం వున్నా... మనస్సుకి విశ్రాంతి లేకుండా పోతోంది స్వామీ!. అసలు నేటి వ్యవస్థ అవస్తే అట్లావుంది. మనశ్శాంతి కరువైంది. మీవంటి మహానుభావుల సాన్నిధ్యాన్ని కోరుతున్నాను..."

"అంటే..." అర్థంకానట్టే విష్ణుశర్మ ముఖంలోకి తేరిపార చూసాను.

"మన్నించాలి!- నా కోసం... నా మనుష్యుల కోసం... మా సమస్యల పరిష్కారం కోసం... మీరు మా వెంట దయచేస్తే... ఏలోటూ రానీకుండా... మీకు సకల సదుపాయాలూ సమకూరుస్తాను.

విష్ణుశర్మ మాటలు ఆలకిస్తూండిపోయాను.

"మీరు మాకు మార్గదర్శకులు కావాలి!. కార్పోరేట్ సమస్యల పరిష్కారానికి... మా వ్యక్తిగత బాధల నివారణకు మాకు ఆరోగ్య సూత్రాలను నేర్పాలి!. మనశ్శాంతితో బ్రతికే మార్గం చూపాలి...!!

రామేశ్వరంలో స్థిరపడాలనే నా ఆలోచనకి విష్ణుశర్మ అభ్యర్థన ఒక అంతరాయమన్పించలేదు. ఇతరుల ప్రయోజనాలకు నేనూ నా మార్గం వుపయోగపడుతుందన్న అవకాశాన్ని ఎందుకుతోసిపుచ్చాలన్పించింది.

"ఏదో ఆలోచిస్తున్నారు..."

"మరేంలేదు - మన ప్రయాణం ఎప్పుడు? " నేటితో దక్షిణ దేశ యాత్ర ముగిసింది. తిరుగు ప్రయాణంలో వుండగా మీ దర్శన భాగ్యం కలిగింది. మీ అంగీకారమైతే... ఈరోజే మనం బయల్దేరదాం స్వామీ..."

"అట్లాగే కానివ్వండి..."

"స్వామీ క్షమించండి! తమ నామధేయాన్ని తెలుసుకోవచ్చా..."

"స్వామి అవినాష్ తీర్థానంద!-" గడ్డం నిమురుతూ శూన్యంలోకి చూస్తూ చెప్పాను.

X X X

ప్లేన్ ఢిల్లీ విమానాశ్రయంలో లాండ్ అయింది!.

విష్ణు శర్మ నేనూ విమానం దిగి... లాంజి దాటి బైటికి రాగానే మమ్ము చూచిన డ్రైవరు కారు తీసుకొచ్చాడు.

ఇద్దరం కారెక్కేం!

బంగళా చేరుకోవటానికి షుమారు గంట సేపు పట్టింది.

సింహద్వారం వద్ద నా పాదాలు కడిగిన విష్ణుశర్మ అర్ధాంగి 'దయచేయండి స్వామీ... లోపలికి దయచేయండి...' అంటూ ఆహ్వానంపలికింది.

విష్ణు శర్మ తన ఇద్దరు ఆడపిల్లలను పరిచయం చేసాడు. వంశోద్ధారకుడు అమెరికాలో చదువుతున్నాడని చెప్పి బంగళా అంతా తిప్పి చూపించాడు.

"చూడండీ శర్మగారు!! - నాకోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయాల్సిన పన్లేదు. నేను సన్యాసిని! పీఠాధిపతిని కాను. నాకు భక్తులుండరు. - ఏక భక్తం! అదీ మితంగ! రాత్రివేళ పాలు పళ్లు అంతకు మించి ఏమీ పుచ్చుకోను. నా పవ్వళింపు చాపమీదే. రోజూ చన్నీళ్ల స్నానం... ధ్యానం... యోగాసనాలు... శివార్చన! ఇవన్నీ ముగిసాక ఎవ్వరితోనైనా మాట్లాడటం!...' నా గురించి వివరించాను.

"మీ మాట శివాజ్ఞ! - మీ విడిది మీడమీది గదిలో... రండి!" దారి చూపిస్తూ ముందుకు నడిచాడు విష్ణు శర్మ.

ఎంతో వున్నత స్థితిలో వున్న విష్ణు శర్మలో గల వినయ విధేయతలు చూచి విస్తుపోయాను.

కారులో సాయంత్రం నాలుగ్గంటలకల్లా శర్మగారు నన్ను వారి ఫ్యాక్టరీకి తీసుకెళ్లి అక్కడి అధికారులకు పరిచయం చేసారు.

"వీరు స్వామీ అవినాష్ తీర్థానంద!. నా అభ్యర్ధన మన్నించి ఇక్కడికి విచ్చేసారు. అనేక కాలుష్యాలతో... మానసిక వొత్తిళ్లతో.. విశ్రాంతి కరువై సతమతమౌతున్న మనల్లాంటి కార్పోరేట్ సంస్థలో పని చేస్తున్న వుద్యోగులకు ప్రాణాయామం.... యోగాభ్యాసం పద్ధతులు అవలంభించటం వల్ల ఏవిధంగ ఆరోగ్యం మెరుగవుతుంది అనే అంశాల గురించి వివరించి మనల్ని 'ట్రైనప్' చేస్తారు...." బ్రీఫ్ చేశాడు అక్కడున్నవారికి

నారాకకు గల ప్రాముఖ్యాన్ని వివరించారు శర్మగారు. అక్కడ వివిధ ఆరోగ్య సూత్రాల గురించి... యోగాసనాల ప్రాముఖ్యాత గురించి... ప్రాణాయామం గురించి ఓ గంట ఉపన్యసించాను.

XXX

నా సూచనల మేరకు 'స్కూల్ ఆఫ్ యోగ ' ను స్థాపించి దాని ప్రాచుర్యం కల్గించటానికి విష్ణుశర్మ గారు అంగీకరించారు.

రోజూ ఒక గంటసేపు విష్ణుశర్మగారి ఫ్యాక్టరీకి వెళ్లి అక్కడి ఉద్యోగులకు యోగ నేర్పటం నా దైనందిక చర్యలో ఒక భాగమైంది.

యోగ స్కూల్ నెలకొల్పటానికి స్థలసేకరణ... ప్లాన్ అప్రూవల్... కన్‌స్ట్రక్షన్ వర్కు పూర్తి అయ్యేసరికి ఏడాది కాలం పట్టింది.

కేవలం శర్మగారి ఆఫీసులో పనిచేసే ఉద్యోగులే కాకుండా ఇతరులు కూడా యోగా క్లాసులకు రావటం ప్రారంభించారు.

యోగాభ్యాస మందిరం... నా కోసం మేడ మీద ప్రత్యేకించి రెండు గదులు. పూజా మందిరం... విజిటర్స్ రూమ్‌తో పాటు అన్ని సదుపాయాలు వసతులు 'స్కూల్ ఆఫ్ యోగా' కి సమకూరినయ్.

విష్ణుశర్మగారిది ఎంతటి విశాల హృదయం? అందరికోసం తాను పాటుపడటం వారిలోగల ఔన్నత్యాన్ని చాటిచెప్తోంది. ' సర్వేజనా సుఖినోభవతు ' అనే దృక్పథం వారిది. శర్మగారు లాంటి నిస్వార్థపరులెందరున్నారు నేటి సమాజంలో?-

విశ్వేశ్వరునికి విభూతితో అర్చన పూర్తి అయింది.

ఇంతలో వాకిలి దగ్గరే వున్న నౌకరు 'స్వామీ తమరికోసం అయ్యగారు కింద హాల్లో నిరీక్షిస్తున్నారు...' విషయం చెప్పాడు.

అంతలోనే "పూజలో వున్నారు కదాని రాలేదు..." వస్తూనే సంజాయిషీ చెప్పుకున్నట్లు మాట్లాడారు శర్మగారు.

"మనం ఈరోజు ఎక్కడికి వెడుతున్నాం?-"

"డిఫెన్స్ కాలనీలో మిలటరీ అఫీషియల్స్ కోసం... కంటోన్మెంట్ ఏరియాకు వెళ్తున్నాం..."

"పదండి..."

ఇద్దరం క్రిందికొచ్చి కారెక్కాం!

కారు పరుగుపెట్టింది

"స్వామీ... వచ్చే నెల్లో నాకు నెలరోజుల పాటు అమెరికా ట్రిప్ ఒకటుంది మిమ్మల్ని కూడా వెంట తీసుకెళ్లాలని వుంది..."

"అలాగే..."

"అక్కడ ఎందరో మన తెలుగువారున్నారు. వారితో మీరొస్తున్న విషయం చెప్పి ఏర్పాట్లు చేయిస్తాను..."

"చాలా సంతోషం!-"

స్వామి...భాషణ చూస్తూ ఇంత చిన్న వయసులో ఎంతటి మితభాషి అని అనుకోనిరోజు లేదు శర్మగారు.

కారు గమ్యం చేరింది!

ఇద్దరం కారు దిగేము.

మిలటరీ అఫిషియల్స్‌లో కొందరు కారు దాకా వచ్చి సాదర ఆహ్వానం పలికారు.

నన్ను వారికి పరిచయం చేసారు శర్మగారు.

బంగారు మేని ఛాయ... కాంతులు విరజిమ్మే శక్తివంతమైన దృష్టి... భుజాలను తాకే జుట్టు.... నల్లటి రంగులో ధగధగ మెరిసే గడ్డం... నా వస్త్రధారణ ఆకృతి చూచి వారంతా చేతులు జోడించారు.

అక్కడికి పక్కనేవున్న సెమినార్ హాల్లోకి అందరం నడిచాం!.

స్టేజిమీద నేను, శర్మగారు మరో ఇద్దరు అధికారులు వున్నాం.

నేలమీద 'కార్పెట్' పరవటంతో మిగతా వారు క్రిందే కూర్చున్నారు.

అందరి దృష్టీ నావైపే !

ఒకరిద్దరు అధికార్లు మీటింగ్ జరపటంలో గల ప్రాముఖ్యతను వివరించారు.

శర్మగారు నన్ను అక్కడి వారందరికీ సభాముఖంగా పరిచయం చేశారు.

నేను మాట్లాడవలసిన క్షణాలు దగ్గరపడినయ్.

మైక్ నా ముందుంది! ఉపన్యాసం ప్రారంభించాను.!

నేను చెప్పబోయే విషయాలు మీ అందరికీ తెల్సినవే! అయినా... కొన్ని ప్రాథమిక సూత్రాలు పాటించనందున ఈ స్పీడ్ యుగంలో మన ఆరోగ్యం దెబ్బతింటోంది. పని వత్తిడికి లోనుకాక తప్పటంలేదు.. కాలుష్యం కోరలుచాచి కాటేస్తోంది. బి.పి. షుగర్ వంటి రోగాల బారిన పడక తప్పటంలేదు. వీటిని తప్పించుకోవటానికి ప్రత్యామ్నాయ మార్గాల కోసం అన్వేషించ వలసివస్తోంది!. ఈ వరసక్రమంలో మనల్ని మనం కాపాడుకోవాలంటే శరీరానికి మనస్సుకి విశ్రాంతినివ్వటం చాలా అవసరం

ఆహారంలో మార్పు చేసుకుని సాత్వికాహారం... పళ్లు, పాలు, తాజా ఆకుకూరలు తినాల్సిన అవసరం ఎంతైనా వుంది. వీటితోపాటు యోగసాధన... ప్రాణాయామం వంటివి చేయాలి!- యోగ అనేది అత్యంత పురాతన సాధన అని చారిత్రక దాఖలాలున్నయ్. రుగ్వేదంలో దీని ప్రాముఖ్యత గురించి ప్రస్తావన కన్పిస్తుంది. ఉపనిషత్తుల్లో యోగా గురించి వివరంగ వుంది. వశిష్టుడు యాజ్ఞవల్క్యుడు వారి శిష్యులకు యోగా సూత్రాలను బోధించారే వాస్తవాన్ని చరిత్ర చెప్తోంది!- అంతేకాదు... పతంజలి మహర్షి యోగ సూత్రాలను గ్రంథరూపంలో తీసుకొచ్చారు - ఇంతకు మించి వివరాల్లోకి పోదలుచుకోలేదు....

చప్పట్లతో సెమినార్ హాలు మార్మోగింది.

గౌరవనీయులైన విష్ణుశర్మ గారు వృత్తిపరంగ పారిశ్రామికవేత్త అయినా... కోటీశ్వరులే అయినా... మానవ సంక్షేమం కోసం 'స్కూల్ ఆఫ్ యోగ' కేంద్రాన్ని స్థాపించి వారి ఔదార్యాన్ని ఔన్నత్యాన్ని చాటుకున్నారు. ప్రతిరోజు ఎందరో వచ్చి యోగ అభ్యసిస్తున్నారు. మీలో ఎవరికైనా నేర్చుకోవలనే జిజ్ఞాస... అభ్యసించాలనే ఆర్తి వుంటే మా యోగా స్కూలుకు రావచ్చు. - మన ఆరోగ్యం మన గుప్పిట్లోనే వుంటుంది... శలవ్!...

ఉపన్యాసం ముగించి ప్రాణాయామం ఎలా చేయాలో చేసి చూపించాను. యోగాలో ఒకటి రెండు పద్ధతులు చేసి చూపించటంతో ఆనాటి కార్యక్రమం ముగిసింది.

విష్ణుశర్మ గారితో పాటు సెమినార్ హాల్లోంచి బైటకొచ్చి కారు సమీపించాను.

ఒక వ్యక్తి గబగబా మావేపు దూసుకురావటం గమనించాను.

ఆ వ్యక్తి నా కళ్లలోకి నిశితంగ చూస్తూ "నువ్వు... సారీ! మీరు... విజయవాడ వాస్తవ్యులైన రామానుజం గారి రెండో అబ్బాయి రఘు కదూ...?..." ఆత్రంగ ప్రశ్నించాడు.

నానుండి ఏవిధమైన స్పందన లేకపోవటంతో "స్వామీజీని చూస్తుంటే... పాతికేళ్ల క్రితం మా ఇంటి నుండి పారిపోయిన మా తమ్ముడు గుర్తొచ్చాడు. అచ్చుగుద్దినట్టు రఘు ఇలాగే వుంటాడు- నేనిక్కడ డిఫెన్స్‌లో పనిచేస్తున్నాను... నా పేరు మహేష్!! -" వుద్వేగంతో మాట్లాడాడు.

"సారీ అండీ!... మనుష్యులను పోలిన మనుష్యులు వుంటారనేది నిజం! -

మీరు పొరపడ్డారు...” శర్మగారు సర్దిచెప్పబోయారు.

“రామానుజంగారు మా నాన్నగారు... ఆయనకు ఇద్దరమే సంతానం. - తమ్ముడికి చదువు అబ్బలేదు. దేశాలు పట్టిపోయాడు... మాతల్లి తమ్ముడి పసితనంలోనే కాలంచేసింది. అయదేళ్ల క్రితం డాడీ పోయారు...” చెమర్చిన కళ్లను తుడుచుకుంటూ ఆ వ్యక్తి భారంగ వెనుదిరిగేడు.

నేనూ విష్ణుశర్మ గారు కారెక్కేము !

కారు వేగంగ ముందుకు దూసుకుపోతోంది!

నా ఆలోచన్లు పూర్తి దిగంతాలకు దొల్లినయ్...

నాన్నగారు కాలం చేసారనే విసయం అన్నయ్య ద్వారా తెల్సుకున్న క్షణంలో... నా మనసు తెలీని బాధకు ఆవేదనకు గురైంది.

నేను సన్యాసినే అయినా... జన్మనిచ్చిన తండ్రి పోయాడనే వార్త ఆపాదమస్తకం కుదిపేసింది. శర్మగారు గమనించకుండా వంటిపైనున్న కండువాతో కనులకొలుకుల్లో నిల్చిన కన్నీరు తుడుచుకున్నాను.

ఎవరి యోగానికి ఎవరు కర్తలు?. అంతా దైవ లీల!

---సమాప్తం---